

## గ్రామగ్రామాన టీఆర్పీ జెండా ఎగరాలి

**పార్టీ సభ్యత్వ నమోదు ప్రతి ఇంటికి చేరాలి**

**ఈ నెల 31న జనగామ కు పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న రాక**

**వెల్లడించిన టీఆర్పీ రాష్ట్ర నాయకుడు మాచర్ల బిక్షపతి**

2


# శనార్తి తెలంగాణ

telanganarajyadhikaraparty.in

సంపుటి : 05 | సంచిక : 335 (కాంప్లిమెంటరీ కాపీ) | ఎడిటర్ : తీన్మార్ మల్లన్న | మంగళవారం 28-07-2026 | పేజీలు : 2


# ఓర్వలేకపోతుండ్రు..

## బీసీ నాయకత్వంపై పొలిటికల్ స్కెచ్

## అగ్రవర్ణాల కుట్రలో భాగమే పీడీ యాక్ట్

**అగ్రవర్ణ మిల్లర్లకు ఊరట.. బీసీ నేతపై పీడీ యాక్టా..?**

**వట్టెపై పీడీ యాక్ట్ పెట్టడంపై భగ్గుమంటున్న బీసీ సమాజం**

**సూర్యాపేటలో పొలిటికల్ గేమ్ షురూ..**

**వట్టే జానయ్య ఆర్థిక, రాజకీయ మూలాలే లక్ష్యంగా దాడులు**

**రూ.వందల కోట్ల బకాయిదారులను వదిలేసి..బీసీ నేతపై కక్షసాధింపా..?**

**బీసీలు రాజ్యాధికారం దిశగా ఎదుగుతుంటే తట్టుకోట్లే..**

**సూర్యాపేటలో గట్టి పోటీ భయంతోనే జానయ్యపై అక్రమ కేసులు**

**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెండింగ్ పడ్డ సీఎంఆర్ బాకీలు**

**అగ్రవర్ణాల మిల్లులపై లేని పీడీ యాక్ట్ జానయ్యకే వర్తిస్తుందా?**

**కొడుకు అరెస్ట్.. మిల్లుల సీజ్.. చివరికి పీడీ యాక్ట్..**

**రేవంత్ సర్కార్ వైఖరిపై బీసీ వర్గాల తీవ్ర ఆగ్రహం**



**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :**

అగ్రవర్ణ మిల్లర్లకు ఒక న్యాయం... బీసీ వ్యాపారికి మరో న్యాయమా? వేల టన్నుల ప్రభుత్వ ధాన్యం పెండింగ్‌లో పెట్టిన బడా నేతలపై లేని పీడీ యాక్ట్ నిబంధనలు... వట్టే జానయ్యయాదవ్ విషయంలోనే అమల్లోకి వచ్చాయా? అంటే అవుననే అంటున్నాయి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని బీసీ సంఘాలు. సూర్యాపేట అసెంబ్లీ రేసులో తమ డిపాజిట్లు గల్లంతవుతాయనే భయంతో అగ్రవర్ణ నాయకులు పన్నిన కుట్రలో భాగమే జానయ్య కొడుకు అరెస్ట్, మిల్లుల సీజింగ్.. పీడీ యాక్ట్ నమోదు. బీసీల ఆర్థిక మూలాలను దెబ్బతీస్తూ, వారి నాయకత్వాన్ని అణచివేయాలని చూస్తున్న రేవంత్ సర్కార్ వైఖరిపై సూర్యాపేటతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీసీ సమాజం భగ్గుమంటోంది. గతంలో ఎన్నడూలేని విధంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా రాజకీయాల్లో ఇప్పుడు 'వట్టే జానయ్య యాదవ్'పై పీడీ యాక్ట్ నమోదు వ్యవహారం అత్యంత తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, బీసీ వర్గాల ఆశాజ్యోతిగా ఎదుగుతున్న వట్టే జానయ్యపై రేవంత్ ప్రభుత్వం తీసుకున్న చర్యలు పక్కా రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగమేనన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీసీలు రాజ్యాధికారం దిశగా ఎదుగుతుంటే ఓర్వలేకే ఈ కుట్రలు చేస్తున్నారంటూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీసీ సమాజం భగ్గుమంటోంది.

వందల కోట్ల బకాయిలున్న మిల్లర్లకు లేని నిబంధనలు.. జానయ్యకే వర్తిస్తాయా?

తరువాయి 2లో...



# ఇరాన్ బెదిరిస్తోంది..!

## అమెరికా వెనకడుగు వేస్తోంది..?

**ఇరాన్-యూఎస్ వార్..!**

**అమెరికా సెల్ఫ్ గోల్..!?**

**దాడులు చేసినా తగ్గని ఇరాన్..!**

**దౌత్య చర్చలకే ప్రాధాన్యం..!**

**చమురు మార్కెట్‌లో కలవరం..!**

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం..!**

**బెడిసికొట్టిన అమెరికా వ్యూహం..?**

**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:**

ఇరాన్‌పై సైనిక దాడులు చేసి తన ఆధిపత్యాన్ని చాటుకోవాలని భావించిన అమెరికాకు ఇప్పుడు కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. చాన్నాళ్లుగా ఇరాన్‌ను టార్గెట్ చేస్తూ.. భారీ వైమానిక దాడులు చేసినా టెహ్రాన్ తన వైఖరిని మార్చుకోలేదు. తమపై దాడులు కొనసాగితే గట్టి ప్రతిస్పందన తప్పదని ఇరాన్ హెచ్చరిస్తోంది. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ఇరాన్‌ను బలహీనపరచాలన్న అమెరికా లక్ష్యం ఎంతవరకు నెరవేరిందన్న చర్చ మొదలైంది. దాడులతో ఇరాన్ వెనక్కి తగ్గుతుందని భావించినా.. ఆ దేశం మాత్రం తన నిర్ణయాల్లో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేస్తోంది. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా సయ్యద్ మొజ్తబా ఖమేనీ సోమవారం సంచలన కామెంట్స్ చేశారు. హెజుబుల్లాపై ఇజ్రాయిల్ దాడులు ఆగే వరకు తాము గల్ఫ్‌లోని అమెరికా వైమానిక స్థావరాలను టార్గెట్ చేయనున్నట్లు ప్రకటించారు. అంతేకాక ఇజ్రాయిల్‌పై కూడా హెజుబుల్లా భీకర్ దాడులు చేయాలని తన ఎక్స్ ఖాతా వేదికగా ఆయన పిలుపునిచ్చారు.

ఇక మరోవైపు అమెరికా ఉన్న ఫళంగా ఆదివారం నుంచే ఇరాన్‌పై దాడులు చేయడాన్ని ఆపేసింది. అమెరికా వద్దనున్న ఆయుధ నిల్వలు తరిగిపోయినట్లు ఆ దేశ రక్షణ నిపుణులే చెబుతున్నట్లు అంతర్జాతీయ వేదికలపై చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే తాము ఎక్కువ కాలం యుద్ధాన్ని కొనసాగించే పరిస్థితిలో లేమనే నిర్ణయానకి అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ వచ్చేసినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ఆయన ఇరాన్‌తో కయ్యానికి కాలు దువ్వే బదులు దౌత్య మార్గాల ద్వారా సమస్యకు ముగింపు పలకాలని భావిస్తున్నట్లు సమాచారం.

తరువాయి 2లో...

## ఇండిగో విమానం

# ఎమర్జెన్సీ ల్యాండింగ్..!

### దుబాయ్ నుంచి ముంబై వస్తున్న ఫ్లైట్

- మార్గ మధ్యలో లగేజీ స్టోర్ విభాగంలో ఒక్కసారిగా వ్యాపించిన పొగలు..!
- అప్రమత్తమైన విమాన సిబ్బంది..
- రాజ్‌కోట్ ఎయిర్ పోర్టులో ల్యాండింగ్
- సురక్షితంగా బయటపడ్డ 194 మంది ప్రయాణికులు



2

## కరూర్ తొక్కిసలాట ఘటనలో కీలక పరిణామం



- సీఎం విజయ్‌కు మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ
- తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వడాన్ని తప్పుబట్టిన కోర్టు
- టీవీకే సర్కార్ ఉత్తర్వుల కొట్టివేత
- బాధిత ఫ్యామిలీస్‌కు ఆర్థికసాయం అందించవచ్చని సూచన

2



# కేంద్రానికి సీజేపీ అల్టిమేటం


## ఒప్పందాన్ని ఉల్లంఘించారు

- సర్కార్ నుంచి లిఖితపూర్వక హామీ కావాలి
- ఎఫ్ఐఆర్‌లు ఉపసంహరించుకోవాలి
- విఫలమైతే మళ్లీ ఆందోళన చేపడతాం..
- డెడ్‌లైన్ దాటితే నిరసన తప్పదు
- కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్

**శనార్తి తెలంగాణ, న్యూఢిల్లీ :**

నిరసనకారులపై నమోదైన కేసులను ఉపసంహరించుకుంటామన్న హామీని కేంద్ర ప్రభుత్వం ఉల్లంఘించిందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసి, అరెస్టయిన వారిని వెంటనే విడుదల చేయకపోతే మళ్లీ దేశవ్యాప్తంగా ఆందోళనలు ప్రారంభిస్తామని కేంద్రానికి స్పష్టమైన అల్టిమేటం జారీ చేసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం, విద్యార్థులపై కేసుల ఎత్తివేతకు ప్రభుత్వం అంగీకరించడంతో జూలై 25న తాము నిరసనలను విరమించినట్లు సీజేపీ నేతలు గుర్తుచేశారు. ఆందోళనలు సమసిపోగానే ఒక్కొక్కరిని లక్ష్యంగా చేసుకుని పోలీసులు వేధింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.

తరువాయి 2లో...



# తెలంగాణకు రెయిన్ అలర్ట్..!

## బంగాళాఖాతంలో వాయుగుండం..!

- 24 గంటల్లో బలపడే ఛాన్స్..!
- రానున్న 4 రోజులు భారీ వర్షాలు
- వాహదారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలి
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక
- పలు జిల్లాలకు రెడ్ అల్టర్ జారీ..!

2



## కెనడాలో భారీ డ్రగ్స్ ముఠా గుట్టురట్టు..!

- భారతీయ మూలాలున్నవారితో సహా 19 మంది అరెస్ట్
- 1.7 టన్నుల మాదకద్రవ్యాల స్వాధీనం
- దొరికిన డ్రగ్స్ విలువ 97 మిలియన్ డాలర్లు..!?
- ప్రాజెక్ట్ బే ఆపరేషన్‌తో సాగుతున్న అక్రమ డ్రగ్స్ రవాణా నెట్‌వర్క్ ఛేధన

**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** కెనడాలో భారీ స్థాయిలో సాగుతున్న మాదకద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌ను అధికారులు ఛేదించారు. ప్రాజెక్ట్ బే ఆపరేషన్‌లో భాగంగా చేపట్టిన దర్యాప్తులో భారతీయ మూలాలున్న వారితో సహా 19 మందిని అరెస్ట్ చేశారు. ఈ ఆపరేషన్‌లో సుమారు 1.7 టన్నుల మాదకద్రవ్యాలను ఆ దేశ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన డ్రగ్స్ విలువ సుమారు 97 మిలియన్ డాలర్లు ఉంటుందని అంచనా వేశారు. కెనడా అంతటా డ్రగ్స్ సరఫరా చేస్తున్న అక్రమ నెట్‌వర్క్‌పై నిఘా పెట్టిన అధికారులు పక్కా ఆధారాలతో దాడులు నిర్వహించారు. డ్రగ్స్ రవాణాకు ఉపయోగించిన వాహనాలు, నగదు, ఇతర వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో మరికొందరి ప్రమేయంపై దర్యాప్తు కొనసాగుతోంది. అంతర్జాతీయ స్థాయిలో సాగుతున్న మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఈ ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.



## కేంద్రానికి సీజేపీ అల్టిమేటం

మొదటిపేజీ తరువాయి...

సీజేపీ ప్రతినిధి అశుతోష్ రాంకా విలేకరులతో మాట్లాడుతూ.. బీహార్, పశ్చిమ బెంగాల్‌లలో వందలాది మంది విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ పోలీసు బలగాలు, దర్యాప్తు సంస్థలు నిరసనకారులతో పాటు వారికి లాజిస్టిక్స్ సహకారం అందించిన వాలంటీర్లపై నిఘా ఉంచి వేధిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ సుప్రీంకోర్టు న్యాయవాది, ఎస్పీ రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్‌తో కలిసి నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడారు. ప్రభుత్వం ముందే ప్లాన్ ప్రకారం వ్యవహరిస్తూ, ఆందోళన ముగిశాక విద్యార్థులను వేధిస్తోందని విమర్శించారు. అక్రమ కేసుల్లో చిక్కుకున్న విద్యార్థులకు, నిరసనకారులకు ఉచిత న్యాయ సహాయం అందించడం కోసం 'సాక్షి' అనే ఆన్‌లైన్ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించినట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. ప్రభుత్వం బుధవారంలోగా తమ డిమాండ్లపై స్పందించకపోతే, గురువారం నుంచి దేశవ్యాప్తంగా మళ్లీ నిరసనల హోరు తథ్యమని ప్రతినిధులు స్పష్టం చేశారు.

## ఇరాన్ బెదిరిస్తోంది..!

మొదటిపేజీ తరువాయి...

యుద్ధం మరింత విస్తరిస్తే మధ్యప్రాచ్యంతో పాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పెరగడం చమురు మార్కెట్‌ను కలవరపెడుతోంది. చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడితే ధరలు పెరిగి అనేక దేశాలపై ఆర్థిక భారం పడే అవకాశం ఉంది. దీంతో అమెరికా వ్యూహం అనుకున్న విధంగా ముందుకు సాగుతోందా...? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

తొలుత ఇరాన్‌పై భీకర దాడులు చేయడం ద్వారా ఇరాన్, దాని ప్రాక్సీ గ్రూప్‌లు తమ దారికి వస్తాయని అమెరికా భావించింది. అలా అనుకునే యూఎస్, ఇజ్రాయిల్ చెరో వైపు ఇరాన్, దాని ప్రాక్సీ సంస్థలపై ఎటాక్స్ చేశాయి. అయితే సుదీర్ఘ కాలంగా ఇరాన్ యుద్ధంలోనే ఉండడం, అమెరికా, ఇజ్రాయిల్‌ను దాదాపు ధీటుగా ఎదుర్కొంటుండడం యూఎస్‌కు చికాకు తెప్పిస్తుండడం గమనార్హం. ఇరాన్‌కు దన్నుగా తెర వెనుక రష్యా, చైనాలు నిలుస్తున్నట్లు అమెరికా భావిస్తోంది. దీంతో పాటు టెహ్రాన్‌కు టర్కీ కూడా మద్దతు ఇస్తున్నట్లు అంచనా వేస్తోంది. ప్రస్తుతం ప్రపంచంలో శాటిలైట్ నిఘాకు సంబంధించి అమెరికా, రష్యా, చైనాలే సుప్రీం దేశాలుగా ఉన్నాయి. అయితే ఇరాన్ పశ్చిమాసియాలోని అమెరికాకు సంబంధించిన వైమానిక స్థావరాలపై అత్యంత కచ్చితత్వంతో దాడులు చేస్తోంది. ఇందుకు ప్రధాన కారణం రష్యా, చైనాల నుంచి ఇరాన్ అందుతున్న శాటిలైట్ సహకారమేనని అమెరికా ఎప్పటి నుంచో అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇక ఇరాన్‌తో సుదీర్ఘ కాలం యుద్ధం చేసే కనుక మెల్లిమెల్లి దాంతో సంధి కుదుర్చుకోవడమే ఉత్తమమనే నిర్ణయానికి వచ్చేసినట్లు తెలుస్తోంది. అయితే అదే జరిగితే అమెరికా తప్పకుండా సెల్ఫ్ గోల్ అయినట్లేనని అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఓర్వలేకపోతుండ్రు..

మొదటిపేజీ తరువాయి...


ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ధాన్యం పెండింగ్ వ్యవహారం ఈనాటిది కాదు. దాదాపు పదేళ్లుగా పలువురు బడా మిల్లర్లు వేలాది మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వానికి అప్పగించకుండా కాలయాపన చేస్తూ వస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 35 నుండి 40కి పైగా రైస్ మిల్లులు ప్రభుత్వానికి అందించాల్సిన సీఎంఆర్ రైస్‌ను బకాయి పడ్డాయి. దాదాపు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పక్కదారి పట్టడం వల్ల ప్రభుత్వ ఖజానాకు రూ. 200 కోట్లకు పైగా గండి పడింది. ఒక్క సూర్యాపేట జిల్లాలోనే 20కి పైగా మిల్లులు పాత సీఎంఆర్ బియ్యాన్ని బకాయి పెట్టాయి. అలాగే ఉమ్మడి జిల్లాకు చెందిన కీలక మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత ఇలాకాలోనూ భారీగా సీఎంఆర్ ధాన్యం పెండింగ్‌లో ఉంది. ఇంతటి భారీ స్థాయిలో సీఎంఆర్ బియ్యం పెండింగ్‌లో ఉన్నప్పటికీ అగ్రవర్ణాలకు చెందిన బడా మిల్లర్లపై నామమాత్రపు నోటీసులతో చేతులు దులుపుకున్న జిల్లా యంత్రాంగం, ఒక్క వట్టే జానయ్య యాదవ్ విషయంలో మాత్రం ఎక్కడా లేని తీవ్రతను ప్రదర్శించడం వెనుక పెద్ద కుట్రే దాగి ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### బీసీల ఆర్థిక మూలాలను దెబ్బతీసే కుట్ర

సీఎంఆర్ బియ్యంలో అవకతవకలు జరిగాయనే నెపంతో జానయ్య యాదవ్‌కు చెందిన వజ్ర రైస్ ఇండస్ట్రీస్, వజ్ర వికాస్ రైస్ మార్ట్‌లను సీజ్ చేసి యజమాన్యానికి కోలుకోలేని దెబ్బతీశారు. అంతటితో ఆగకుండా ఆయన కొడుకును సైతం అరెస్ట్ చేశారు. ఇప్పుడు నేరుగా వట్టే జానయ్యపై ఏకంగా పీడీ యాక్ట్ ప్రయోగించడం పైశాచిక రాజకీయాలకు నిదర్శనమని బీసీ సంఘాలు ఆరోపిస్తున్నాయి. గతంలో కూడా ఆయన రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఉన్నప్పుడు రకరకాల దుష్ప్రచారాలు చేసి బద్నాం చేసేందుకు ప్రయత్నించారు. ఇప్పుడు మరోసారి ఆయన వ్యాపారాలను, ఆర్థిక మూలాలను దెబ్బతీసేందుకు సూర్యాపేట జిల్లాలోని అగ్రవర్ణ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సూర్యాపేట నియోజకవర్గంలో బీసీ సామాజిక వర్గం జనాభా అత్యధికం. రానున్న రోజుల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరపున వట్టే జానయ్య యాదవ్ సూర్యాపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగితే... అక్కడ దశాబ్దాలుగా ఏలుతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లోని అగ్రకుల నాయకుల డిపాజిట్లు గల్లంతవడం ఖాయమనే సంకేతాలు వెళ్లాయి. ఒక బీసీ నేత రాజకీయంగా బలపడి అసెంబ్లీ మెట్లు ఎక్కితే తమ ఆధిపత్యానికి శాశ్వతంగా గండిపడుతుందనే ముందస్తు భయంతోనే ఆయనను మానసికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అణచివేయడానికి సూర్యాపేటలోని అగ్రవర్ణ శక్తులు ఈ పొలిటికల్ గేమ్ ఆడాయని విమర్శకులు పేర్కొంటున్నారు.

### రేవంత్ సర్కార్ వైఖరిపై బీసీ సమాజం ఆందోళన

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అగ్రవర్ణాలకు చెందిన మిల్లర్లు వేల టన్నుల బియ్యం బకాయిపడితే రాని 'పీడీ యాక్ట్' చట్టాలు... ఒక బీసీ నేత విషయంలోనే ఎలా ముందుకు వచ్చాయి? రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ అగ్రవర్ణ మిల్లర్లకు కొమ్ముకాస్తూ ఎదుగుతున్న బీసీ నాయకత్వంపై కక్షపూరితంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు ధోరణి వీడి, ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ సీఎంఆర్ మిల్లర్లందరిపైనా ఒకే రకమైన నిబంధనలు అమలు చేయాలని, వట్టే జానయ్యయాదవ్ పై మోపిన అక్రమ పీడీ యాక్ట్ కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని బీసీ సమాజం డిమాండ్ చేస్తోంది.



## తెలంగాణకు రెయిన్ అలర్ట్..!

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** వాయవ్య బంగాళాఖాతం దానికి ఆనుకొని ఉన్న ఉత్తర ఒడిశా–పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలపై ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఇది రాబోయే 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. సోమవారం నాటికి పారాదీప్–సాగర్ ద్వీపాల మధ్య ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలను దాటుతుందని వెల్లడించింది. దీని ప్రభావంతో జులై 31వరకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, పిడుగులతో పాటు కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. సాధారణ సగటు వర్షపాతం 227.4 మి.మీ కురువాల్సి ఉండగా, 109.7 మి.మీ కురిసిందని తెలిపింది.ఒడిశా, ఆంధ్రా తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని స్పష్టం చేసింది. సముద్రం ఎగసిపడుతుందని.. మత్స్యకారులెవరు వేటకు వెళ్లవద్దని హెచ్చరించింది. తెలంగాణలో 4 రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తెలంగాణలోని పలు జిల్లాలకి వాతావరణ అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ముఖ్యంగా ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, హన్మకొండ, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, మెదక్, కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఈనెల 30వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. భారీవర్షాల దృశ్య లోతట్టు ప్రాంతాల ప్రజలు, హైదరాబాద్ వంటి నగరాల్లో వహదారులు, రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లోని రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేసింది.

## గ్రామగ్రామాన టీఆర్పీ జెండా ఎగరాలి

- పార్టీ సభ్యత్వ నమోదు ప్రతి ఇంటికి చేరాలి
- మండల కమిటీలు, గ్రామ కమిటీల నిర్మాణం జరగాలి
- ప్రతి గ్రామంలో టీఆర్పీ గద్దెలు నిర్మించాలి
- ఈ నెల 31న జనగామ కు పార్టీ అధినేత,ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న రాక
- వెల్లడించిన టీఆర్పీ రాష్ట్ర నాయకుడు మాచర్ల బిక్షపతి

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** తెలంగాణ రాజ్యాధికార పార్టీ జనగామ జిల్లా అధ్యక్షులు కట్ల సదానందం ముదిరాజ్ గారి అధ్యక్షతన సోమవారం జనగామ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి రాష్ట్ర నాయకులు డాక్టర్ కర్నల్ మాచర్ల బిక్షపతి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీనతల వర్గాల ఆశాజ్యోతి మన అందరి అభిమాని అయిన తీన్మార్ మల్లన్న 31న జనగామ జిల్లా కు రానున్నారని తెలిపారు. కావున పార్టీ కార్యకర్తలు ఒక సైనికుడిల పనిచేస్తూ ఈ సభను విజయవంతం చేయాల్సిందిగా కోరారు. అలాగే, పార్టీ కార్యక్రమాలపై మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో గ్రామగ్రామాన టీఆర్పీ జెండా ఎగరాలని, పార్టీ సభ్యత్వ నమోదు ప్రతి ఇంటికి చేరాలని ఆయన ఆకర్షించారు.

మండల కమిటీలు, గ్రామ కమిటీల నిర్మాణం వేగంగా జరగాలనీ, ప్రతి గ్రామంలో టీఆర్పీ గద్దెలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను ఏకం చేస్తూ.. అగ్రవర్ణపై ఉక్కుపాదం మోపాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గడ్డం కృష్ణ ,జిల్లా ఉపాధ్యక్షులు రేణుగుంట్ల మురళి నియోజకవర్గ ఇంచార్జ్ సీసా శ్రీధర్ గౌడ్ , జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్ , వర్కింగ్ ప్రెసిడెంట్ జిట్టబోయిన నరేష్ , జిల్లా కార్యదర్శి మంద దిలీప్ ,TRVS జనగామ జిల్లా అధ్యక్షులు అజయ్, మహిళా అధ్యక్షురాలు రాణి , మైనారిటీ అధ్యక్షులు యాకుబ్ పాషా, జిల్లా నాయకులు మహమ్మద్ అంజద్ పాషా జిల్లా కార్యదర్శి గంగరాజు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రంగనాథ్‌ను తొలగించండి

- మరో ఐజీ స్థాయి అధికారిని నియమించండి
- సీఎస్‌కు హైకోర్టు సంచలన ఆదేశాలు
- లోతుకుంట భూముల వ్యవహారంలో హైకోర్టు ఆదేశాలను ధిక్కారం
- రంగనాథ్ క్షమాపణలు చెప్పినా పరిగణనలోకి తీసుకోని న్యాయస్థానం
- రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ కేసులు


**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** తెలంగాణ హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్‌ను తక్షణమే ఆ పదవి నుంచి తొలగించాలని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆయన స్థానంలో మరో ఐజీ స్థాయి అధికారిని నియమించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. లోతుకుంట పరిధిలోని భూముల వ్యవహారంలో కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి ప్రైవేటు స్థలాల్లోకి హైడ్రా బృందాలు ప్రవేశించడంపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రంగనాథ్‌ను అదే బాధ్యతల్లో కొనసాగిస్తే 'రూల్ ఆఫ్ లా' దెబ్బ తింటుందని, ఆయనపై ఇప్పటికే 63 కోర్టు ధిక్కరణ కేసులు ఉండటం తీవ్రమైన విషయమని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ అఫిడవిట్ దాఖలు చేస్తూ కోర్టుకు బేషరతు క్షమాపణలు తెలిపారు.



లోతుకుంట సర్వే నంబర్లు 1, 2 పరిధిలోని 40 ఎకరాల స్థలంలోకి తమ బృందం వెళ్లలేదని, పిటిషనర్ అవాస్తవాలు చెబుతున్నారని ఆయన పేర్కొన్నారు. సెక్రటరీ ర్యాంక్‌లో ఉన్న అధికారి పదే పదే ఉల్లంఘనలకు పాల్పడటాన్ని తీవ్రంగా పరిగణించిన హైకోర్టు, ఆయన క్షమాపణలను తోసిపుచ్చింది. లోతుకుంట ప్రైవేటు భూముల వ్యవహారంలో హైడ్రా జోక్యం చేసుకోవడం చట్ట విరుద్ధమని, సదరు అధికారిని పదవి నుంచి తప్పించడం మినహా వేరే మార్గం లేదని అభిప్రాయపడింది.

## కేసీఆర్ సింగరేణికి తీరని ద్రోహం చేసిండు

- సంస్థను నష్టాల ఊబిలోకి నెట్టేసిండు
- అదే విధానాలను కొనసాగిస్తున్న కాంగ్రెస్ సర్కార్
- ఆ రెండు పార్టీల వల్లే తగ్గిన ఆదాయం
- రూ.54 కోట్ల బకాయిలు పెండింగ్ పెట్టిన సర్కార్
- సౌతిండియాలో అతిపెద్ద బొగ్గు కంపెనీ
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ పాలన రెండూ సింగరేణిని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తున్నాయని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి విమర్శించారు. పదేళ్ల పాలనలో మాజీ సీఎం కేసీఆర్ సంస్థను తన రాజకీయ అవసరాలకు వాడుకుని తీరని ద్రోహం చేశారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తోందని ఆరోపించారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి సంస్థ అయిన సింగరేణిలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం, తెలంగాణ ప్రభుత్వానికి 51 శాతం వాటా ఉందని ఆయన గుర్తుచేశారు. ఈ సంస్థ నుంచి తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు ఎన్‌టీపీసీకి భారీగా బొగ్గు సరఫరా అవుతోందని, రెండు పార్టీల తప్పుడు నిర్ణయాల వల్ల ఆదాయం గణనీయంగా పడిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా సింగరేణి పరిస్థితి మెరుగుపడలేదని కిషన్ రెడ్డి అన్నారు. సంస్థకు రావాల్సిన రూ. 54 కోట్ల బకాయిలను ప్రభుత్వం ఇంకా చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టిందని, ఇతర రాష్ట్రాల్లో జరిగే బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకుండా సింగరేణిని నిరోధిస్తున్నారని తెలిపారు. తెలంగాణ జెన్‌కో టెండర్లలో పోటీ సృష్టించడం ద్వారా సంస్థకు నష్టం చేకూరుస్తున్నారని పేర్కొన్నారు. రాజకీయాలను పక్కనపెట్టి సింగరేణి ఉనికిని, ఆదాయాన్ని కాపాడటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు.

## అయోధ్య విరాళాల చోరీ కేసులో కీలక పరిణామం

- సిట్ బృందంలో ఫోరెన్సిక్ ఆడిటర్‌ను చేర్చండి
- కేసు ఏ దశలో ఉందో కూడా చెప్పండి
- 2 వారాల్లో సమగ్ర దర్యాప్తు నివేదికను సమర్పించాలి
- యూపీ సర్కార్‌కు సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు

**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** అయోధ్య రామ మందిరంలో భక్తుల విరాళాల దుర్వినియోగం ఆరోపణల కేసులో సుప్రీంకోర్టు మరో కీలక ఆదేశం జారీ చేసింది. దర్యాప్తు వేగంగా, నాణ్యంగా సాగేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)లో తప్పనిసరిగా ఫోరెన్సిక్ ఆడిటర్‌ను చేర్చాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రస్తుతం లక్నో రేంజ్ ఐజీ ఎస్.కిరణ్ నేతృత్వంలో డీఐజీ, ఎస్‌ఎస్పీ సభ్యులుగా ఉన్న సిట్ ఈ కేసును విచారిస్తోంది. ఇప్పటివరకు దర్యాప్తు కొనసాగుతుండగా, సాక్ష్యాలు, ఆర్థిక లావాదేవీలు, విరాళాల లెక్కలు, నగదు నిర్వహణ విధానాలపై విచారణ జరుగుతోందని రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. ఈ నేపథ్యంలో కేసు పురోగతి, ఇప్పటివరకు వెలుగులోకి వచ్చిన అంశాలతో కూడిన సమగ్ర స్థితిగతుల నివేదికను రెండు వారాల్లో సమర్పించాలని సుప్రీంకోర్టు సిట్‌ను ఆదేశించింది. దర్యాప్తును తాము నిరంతరం పర్యవేక్షిస్తామని, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ, ట్రస్ట్ ఆర్థిక వ్యవహారాలపై ఫోరెన్సిక్ ఆడిట్ కోరుతూ దాఖలైన పిటిషన్లపై తదుపరి విచారణపై నివేదిక అనంతరం చేపట్టనున్నట్లు తెలిపింది.

## ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్..!

**శనార్తి తెలంగాణ, ఢిల్లీ :** ఇటీవల విమాన ప్రమాదాలు తరచుగా జరుగుతుండటం తీవ్ర కలకలం రేపుతోంది. తాజాగా సోమవారం దుబాయ్ నుంచి ముంబైకి బయలుదేరిన ఇండిగో విమానం మార్గమధ్యలో ఉండగానే కార్గో హోల్డ్‌లో ఒక్క సారిగా పొగలు వ్యాపించాయి. పొగలు రావడాన్ని గుర్తించిన సిబ్బంది అప్రమత్తమై, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు సమాచారం అందించి, ముందస్తు ల్యాండింగ్ కు అనుమతి తీసుకున్నారు. విమానాన్ని గుజరాత్‌లోని రాజ్‌కోట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. ఈ సమయంలో విమానంలో సిబ్బందితో సహా మొత్తం 194 మంది ప్రయాణికులు ఉండగా, వారందరూ సురక్షితంగా బయటపడ్డారని, ఎవరికి ఎలాంటి నష్టం జరగలేదని సంబంధిత అధికారులు తెలిపారు.ఈ ఘటన నేపథ్యంలో రాజ్‌కోట్ విమానాశ్రయంలో అధికారులు 'ఫుల్ ఎమర్జెన్సీ' ప్రకటించారు. విమానం ల్యాండ్ అయ్యే సమయానికి అగ్నిమాపక దళం, భద్రతా బృందాలను సిద్ధంగా ఉంచారు. విమానం దారి మళ్లించడంతో ప్రయాణికులు కొంత ఆందోళనకు గురైనప్పటికీ, విమాన సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి వారందరినీ సురక్షితంగా కిందకి దించారు. కార్గో విభాగంలో పొగలు రావడపై ఇండిగో సాంకేతిక బృందం విచారణ చేపట్టింది.



## కరూర్ తొక్కిసలాట ఘటనలో కీలక పరిణామం

**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** కరూర్ తొక్కిసలాట ఘటనలో తమిళనాడు సీఎం విజయ్‌కు మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూ... టీవీకే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు తప్పుబట్టింది. బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేసింది. ఈ మేరకు ఆ ఉత్తర్వులను సోమవారం కోర్టు రద్దు చేసింది. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆర్థికసాయం అందించడంలో ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేసింది. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం తీసుకునే చర్యలు చట్టపరమైన మార్గాల్లో మాత్రమే ఉండాలని తెలిపింది. తమిళనాడు గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా టీవీకే అధినేత కరూర్ వెళ్లినప్పుడు తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. ఈ సంఘటనలో పెద్ద మొత్తంలో ప్రాణ నష్టం జరగడం దేశ వ్యాప్తంగా కలకలం రేపింది. ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ కరూర్ తొక్కిసలాటలో మృతి చెందిన కుటుంబీలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారు. ఇక ఇది కాస్తా రాజకీయ రంగు పులుముకోవడం, కొందరు విజయ్ సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ... మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలోనే అటు ప్రభుత్వ, ఇటు పిటిషనర్ల వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం రాష్ట్ర సర్కార్ ఇచ్చిన ఉత్తర్వులను కొట్టేసింది.